నమస్తే తెలంగాణ
మెదక్
I | హైదరాబాద్, శనివారం 16 నవంబర్ 2024 | MEDAK


ఫార్మాసిటీ ఏర్పాటుకు వ్యతిరేకంగా డప్పూరులో నిర్వహించిన రైతుల ఆందోళనలో పాల్గొన్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు (ఫైల్)

## రేవంత్ సర్కార్ కుట్రపై
# రగులుతున్న రైతులు

### ఫార్మాసిటీ ఏర్పాటుపై రైతుల్లో ఆగ్రహం

- న్యాల్‌కల్ రైతుల్లో చర్చనీయాంశంగా వికారాబాద్ ఘటన
- కాంగ్రెస్ సర్కార్ ఫార్మాసిటీ ఏర్పాటును నిలిపివేయాలని డిమాండ్

సంగారెడ్డి, నవంబర్ 15(నమస్తే తెలంగాణ): ఫార్మాసిటీ పేరుతో పచ్చని పొలాలను కాలుష్య కాసారాలుగా మార్చాలన్న రేవంత్ సర్కార్ కుట్రలపై ఇటీవల వికారాబాద్ రైతులు తిరుగుబాటు చేయటం సంగారెడ్డి జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. వికారాబాద్ జిల్లాలోని లగచర్ల గ్రామంలో ఫార్మాసిటీకి వ్యతిరేకంగా రైతులు ఆందోళన చేపట్టారు. సోషల్ మీడియాలో రైతుల ఆందోళన దృశ్యాలను సంగారెడ్డి జిల్లాలోని డప్పూరు, వడ్డీ, మాల్గి గ్రామాల రైతులు పరిశీలించారు. రేవంత్ సర్కార్ న్యాల్‌కల్ మండలంలోనూ ఫార్మాసిటీ ఏర్పాటుకు భూసేకరణ మొదలుపెట్టడమే ఇందుకు కారణం. ఫార్మాసిటీకి వ్యతిరేకంగా వడ్డి, డప్పూరు, మాల్గి గ్రామాల రైతులు రెండు నెలలకుపైగా ఆందోళనలు చేస్తున్నారు. సీఎం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని భూములు కోల్పోతున్న రైతులు డిమాండ్ చేస్తున్నారు.

**ఫార్మాసిటీకి వ్యతిరేకంగా రైతుల పోరాటం**

మండలంలోని డప్పూరు, వడ్డీ, మాల్గి గ్రామాల్లో ఫార్మాసిటీ కోసం ప్రభుత్వం రెండు వేల ఎకరాల భూసేకరణకు నోటిఫికేషన్ ఇచ్చింది. రెవెన్యూ అధికారులు భూసేకరణ ప్రక్రియను ప్రారంభించారు. బలవంతపు భూసేకరణను నిలిపివేయాలని రైతులు పోరాటం చేస్తున్నారు. మూడు పంటలు పండే సారవంతమైన భూములను ఫార్మాసిటీ కోసం ఇచ్చేది లేదని రైతులు తెగేసిచెబుతున్నారు. ఫార్మాసిటీ ఏర్పాటుతో జల, వాయు కాలుష్యం పెరిగి ప్రజల ఆరోగ్యాలు దెబ్బతింటాయని రైతులు, ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఫార్మాసిటీకి వ్యతిరేకంగా న్యాల్‌కల్ మండలంలో ఆందోళనా కార్యక్రమాలు నిర్వహించటంతోపాటు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. మాజీమంత్రి హరీశ్‌రావు గతనెల డప్పూరులో పర్యటించి రైతుల ఆందోళనలో పాల్గొన్నారు. రైతులతో ముఖాముఖి మాట్లాడి రైతుల సమస్యలు తెలుసుకోవటంతోపాటు ప్రభుత్వం సేకరించనున్న భూములను పరిశీలించారు. ఆందోళనలో పాల్గొన్న హరీశ్‌రావు రేవంత్ సర్కార్ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫార్మాసిటీ ఏర్పాటుకు వ్యతిరేకంగా రైతులతో కలిసి పోరాటం చేస్తూనే గ్రీన్ ట్రిబ్యునల్‌ను, హైకోర్టును ఆశ్రయిస్తామని హెచ్చరించారు. దీంతో భూసేకరణ కొనసాగడం లేదు. తాజాగా వికారాబాద్ జిల్లాలో ఫార్మాసిటీ కోసం గ్రామసభలు నిర్వహించటం, రైతులు తిరగుబాటు చేయటం న్యాల్‌కల్ మండలం రైతుల్లో చర్చనీయాంశంగా మారింది. సొంత జిల్లా రైతుల తిరుగుబాటును గుర్తించి రేవంత్ సర్కార్ న్యాల్‌కల్‌లో ఫార్మాసిటీ ఏర్పాటు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని రైతులు, ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.


సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు తెలంగాణ తల్లి విగ్రహం ఎదుట జై తెలంగాణ నినాదాలు చేస్తున్న కేటీఆర్, బీఆర్ఎస్ నాయకులు

# కేటీఆర్‌కు ఘన స్వాగతం

- బొట్టుపెట్టి స్వాగతం పలికిన మహిళలు
- తెలంగాణ తల్లి విగ్రహానికి నివాళులర్పించిన కేటీఆర్
- భారీగా తరలివచ్చిన బీఆర్ఎస్ శ్రేణులు
- జై తెలంగాణ, జై కేసీఆర్ నినాదాలతో దద్దరిల్లిన సంగారెడ్డి, పటాన్‌చెరు నియోజకవర్గాలు

పటాన్‌చెరు, నవంబర్15: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు సంగారెడ్డి, పటాన్‌చెరు నియోజకవర్గాల బీఆర్ఎస్ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. రంగారెడ్డి జిల్లా లగచర్లలో నిర్మించనున్న ఫార్మా కంపెనీ నిర్మాణానికి వ్యతిరేకంగా గళంవిప్పిన రైతులను అక్రమంగా అరెస్టు చేసి సంగారెడ్డి జిల్లా కంది జైలులో పెట్టిన సందర్భంగా రైతులను పరామర్శించి వారిలో ఆత్మవిశ్వాసం నింపేందుకు కేటీఆర్ పటాన్‌చెరు మీదుగా కంది వెళ్లారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఐబీ భవనం వద్ద బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున హాజరై కేటీఆర్‌కు ఘనస్వాగతం పలికారు. పార్టీ శ్రేణులతో కలసి ఆదర్శ్‌రెడ్డి, మెట్టు కుమార్‌యాదవ్, కొలన్ బాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, శంకర్‌యాదవ్, కార్పొరేటర్ సింధు కేటీఆర్‌ను ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా మహిళలు కేటీఆర్‌కు బొట్టుపెట్టి ఆహ్వానించారు. ముస్లిం మహిళలు కేటీఆర్ చేతికి ఇమామే జామిన్ కట్టి అభిమానం చాటుకున్నారు. ఐబీ బంగ్లా ఆవరణలోని తెలంగాణ తల్లి విగ్రహానికి కేటీఆర్ పూలమాల వేసి నివాళులర్పించారు. జై తెలంగాణ, జైజై తెలంగాణ, జై కేసీఆర్ అంటూ బీఆర్ఎస్ శ్రేణులు నినాదాలు చేశారు. కేసీఆర్ నాయకత్వం వర్ధిల్లాలి, రేవంత్‌రెడ్డి డౌన్‌డౌన్‌తో ఆ ప్రాంతం దద్దరిల్లింది. పార్టీ నాయకులను కేటీఆర్ అభిమానంతో పేరుపేరునా పలకరించడంతో వారిలో ఉత్సాహం రెట్టింపు అయింది. లగచర్ల రైతులను పరామర్శించేందుకు కంది వెళ్తున్నానని కేటీఆర్ పార్టీ శ్రేణులతో చెప్పి ముందుకు వెళ్లారు. ఈ సందర్భంగా పటాన్‌చెరు పార్టీ శ్రేణులు కేటీఆర్‌ను అనుసరించాయి. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తొంట అంజయ్యయాదవ్, వెంకటేశం గౌడ్, సోమిరెడ్డి, శ్రీధర్‌చారి, రాములుగౌడ్, అక్రం పాషా, వంగరి అశోక్ పాల్గొన్నారు.


పటాన్‌చెరులో కేటీఆర్‌కు ఇమామే జామిన్ కడుతున్న ముస్లిం మహిళలు


పటాన్‌చెరులో కేటీఆర్‌కు స్వాగతం పలికేందుకు భారీగా తరలివచ్చిన బీఆర్ఎస్ శ్రేణులు

**కందిలో...**

కంది, నవంబర్ 15: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌కు శుక్రవారం కందిలో ఘన స్వాగతం లభించింది. లగచర్ల రైతులను అక్రమంగా అరెస్టు చేసి కంది సెంట్రల్ జైలుకు తరలించారు. జైలులో వారిని పరామర్శించేందుకు కేటీఆర్ బీఆర్ఎస్ నాయకులతో కలిసి వచ్చారు. సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ నాయకులు, కార్యకర్తలతో కేటీఆర్‌కు స్వాగతం పలికారు. కాబోయే సీఎం కేటీఆర్ అంటూ జై తెలంగాణ నినాదాలు చేశారు. నాయకులు, కార్యకర్తలతో మాట్లాడిన కేటీఆర్ జైలుకు బయలుదేరారు. కార్యక్రమంలో డీసీసీబీ వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, బీఆర్ఎస్ కంది మండల అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, నాయకులు నరహరిరెడ్డి, కాసాల బుచ్చిరెడ్డి, జైపాల్‌రెడ్డి, చిల్వేరి ప్రభాకర్, మామిళ్ల రాజేందర్‌తో పాటు పెద్దసంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

**రామచంద్రాపురంలో...**

రామచంద్రాపురం, నవంబర్ 15: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌కు బీఆర్ఎస్ శ్రేణులు పటాన్‌చెరులో పెద్దఎత్తున స్వాగతం పలికారు. కేటీఆర్ సంగారెడ్డికి వెళ్తున్న విషయం తెలుసుకున్న కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆర్సీపురం, భారతీనగర్ డివిజన్ల నుంచి, మాజీ సర్పంచ్ సోమిరెడ్డి ఆధ్వర్యంలో వైస్ చైర్మన్ రాములు గౌడ్, కౌన్సిలర్లు, నాయకులు తెల్లాపూర్ మున్సిపాలిటీ నుంచి పెద్దఎత్తున బీఆర్ఎస్ శ్రేణులు పటాన్‌చెరుకు తరలివెళ్లారు.


పటాన్‌చెరులో కేటీఆర్‌కు మొక్కను బహూకరించి స్వాగతం పలుకుతున్న కార్పొరేటర్లు మెట్టు కుమార్‌యాదవ్, సింధూఆదర్శ్‌రెడ్డి


పటాన్‌చెరులో కేటీఆర్‌కు స్వాగతం పలుకుతున్న అభిమానులు



కేటీఆర్‌కు స్వాగతం పలుకుతున్న చంటి క్రాంతికిరణ్, చింతా ప్రభాకర్, ఎర్రోళ్ల శ్రీనివాస్


కందిలో కేటీఆర్ కోసం చూస్తున్న చింతా ప్రభాకర్, బీఆర్ఎస్ శ్రేణులు

## మల్లన్న సన్నిధిలో కార్తిక దీపోత్సవం

చేర్యాల, నవంబర్ 15: కార్తిక పౌర్ణమి సందర్భంగా కొమురవెల్లి మల్లన్న క్షేత్రంలో శుక్రవారం లక్ష దీపోత్సవ కార్యక్రమాన్ని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ బాలాజీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ఉత్సవ విగ్రహాలకు పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ అధికారులు, సిబ్బంది, అర్చకులు, ఒగ్గు పూజారులు మహా మండపం, గంగరేగు చెట్టు ఆవరణలో లింగకారం, ఓం, స్వస్తిక్ ఆకారాల్లో దీపాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమాల్లో ఆలయ అధికారులు, సిబ్బంది, అర్చకులు, ఒగ్గు పూజారులు, భక్తులు పాల్గొన్నారు.


ఆలయ ఆవరణలో లింగాకారం, స్వస్తిక్, ఓం ఆకారాల్లో ఏర్పాటు చేసిన దీపాలు

## తూకంలో తేడా

- పత్తి మిల్లు ఎదుట రైతుల ఆందోళన
- రెండు రోజుల పాటు కొనుగోలు నిలిపివేత



వీరన్నపేటలో పత్తి మిల్లు ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

చేర్యాల, నవంబర్ 15: పత్తి మిల్లు తూకంలో తేడాలు వస్తున్నాయంటూ మండలంలోని వీరన్నపేట గ్రామ శివారులోని మహేశ్వరి కాటన్ ఇండస్ట్రీస్ వద్ద రైతులు శుక్రవారం ఆందోళన నిర్వహించారు. పత్తిని తూకం వేయిస్తే పలుమార్లు వివిధ రకాలుగా తేడాలు వచ్చాయని,కొన్ని రోజులుగా మిల్లులో ఇదే తంతు కొనసాగుతున్నదని, దీంతో నష్టపోయామని రైతులు ఆరోపించారు. మండలంలోని ముస్త్యాల గ్రామానికి చెందిన బండారు సతీశ్, ఆకునూరి శేఖర్ తీసుకుపోయిన పత్తి తూకంలో తేడా రావడంతో వారికి తోడుగా ఇతర ప్రాంతాల రైతులు ఆందోళనకు దిగారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన ఆదేశాల మేరకు జిల్లా మార్కెటింగ్ అధికారి నాగరాజు, కాటన్ పర్చేజింగ్ ఆఫీసర్ అమిత్‌పాటిల్ మిల్లును సందర్శించి రైతులతో మాట్లాడి తూకం వేసే యంత్రాన్ని పరిశీలించారు. సాంకేతిక కారణాలతో తూకంలో తేడా వచ్చిందని, రెండు రోజుల పాటు మిల్లులో కొనుగోలు నిలిపివేస్తున్నట్లు డీఎంవో తెలిపారు.

## అన్నదాతలకు అండగా ఉంటాం

- మంత్రి పొన్నం ప్రభాకర్

కొండపాక(కుకునూరుపల్లి), నవంబర్ 15: అన్నదాతలకు అండగా ఉండి, వ్యవసాయానికి పూర్వవైభవం తీసుకువస్తామని రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం కొండపాక మండలం దుద్దెడలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించడంతోపాటు ఇంటింటి సర్వేను పరిశీలించారు. మంత్రి మాట్లాడుతూ..కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సీనియర్ ఐఏఎస్ అధికారులను నియమించి, వారి పర్యవేక్షణలో ధాన్యం కొనుగోలు చేస్తున్నామన్నారు. సన్న వడ్లు పండించిన రైతులు అధైర్యపడవద్దని, రూ.500 బోనస్ ఇస్తామని తెలిపారు. రైస్ మిల్లర్ల విషయంలో ఎక్కడా ఇబ్బంది లేదన్నారు. జిల్లాలో 20మంది డిఫాల్టర్లు ఉన్నారని, వారు ప్రభుత్వ బకాయిలు చెల్లించి కొనుగోలులో పాల్గొనాలన్నారు. ప్రతి గింజను ప్రభుత్వం కొంటుందని రైతులకు హామీ ఇచ్చారు. అనంతరం గ్రామంలో జరుగుతున్న సర్వేను పరిశీలించిన మంత్రి ఎన్యూమరేటర్లకు సూచనలు చేశారు. కార్యక్రమంలో గజ్వేల్ ఆర్డీవో చంద్రకళ, కొండపాక తహసీల్దార్ దిలీప్‌నాయక్ పాల్గొన్నారు.

## కమ్మేసిన కాలుష్య పొగ

*సంగారెడ్డి జిల్లా గడ్డపోతారం గ్రామాన్ని, పారిశ్రామికవాడను రసాయన పరిశ్రమల కాలుష్య పొగ కమ్మేసింది. శుక్రవారం ఉదయం ఎనిమిది గంటల నుంచి తొమ్మిది గంటల వరకు కాలుష్య పొగ కమ్మేయడంతో ప్రజలు, కార్మికులు అవస్థలు పడ్డారు. అసలే చలికాలం కావడంతో ప్రమాదకర రసాయనాల పొగతో నానా ఇబ్బందులు పడుతున్నట్లు గ్రామస్తులు తెలిపారు. పరిశ్రమల నుంచి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని, పరిశ్రమల యాజమాన్యాల తీరులో మార్పు రావడం లేదని, పీసీబీ అధికారులు సైతం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు.* – జిన్నారం, నవంబర్ 15

గడ్డపోతారం పారిశ్రామికవాడను కమ్మేసిన రసాయన పొగ


## చౌటపల్లిలో రైతుల సమావేశం

- వివరాలు సేకరించిన పోలీసులు
- 'నమస్తే' కథనంపై చర్చ..

అక్కన్నపేట, నవంబర్ 15: మండలంలోని చౌటపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం 312 సర్వే నంబర్ బాధిత రైతులు సమావేశమయ్యారు. విషయం తెలుసుకున్న హుస్నాబాద్ సీఐ శ్రీనివాస్, అక్కన్నపేట ఎస్ఐ విజయభాస్కర్ సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకున్నారు. సమావేశం ఎందుకు ఏర్పాటు చేశారని వివరాలు సేకరించారు. గొడవలు సృష్టిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీసులు వెళ్లిపోయిన అనంతరం రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ ఇండస్ట్రియల్ పార్కుకు భూములు ఇవ్వమని తీర్మానించుకున్నారు. సమిష్టిగా ఉంటూ శాంతియుతంగా పోరాటం చేయాలని నిర్ణయించుకున్నారు. ఇండస్ట్రియల్ పార్కు విషయంపై స్థానిక కాంగ్రెస్ నాయకులతో మరోసారి చర్చించి, వారి ద్వారా మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లి ఇక్కడ ఏర్పాటు చేయకుండా ఉండేలా ప్రయత్నాలు చేయాలనే ఆలోచనతో ఉన్నారు. కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు, బాధిత రైతులు పాల్గొన్నారు.


చౌటపల్లిలో సమావేశమైన సర్వేనంబర్ 312 బాధిత రైతులు

**నమస్తే కథనంపై చర్చ...**

నమస్తే తెలంగాణలో ఇండస్ట్రియల్ పార్కు వద్దే వద్దు... అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీంతో నమస్తే కథనంపై మండలంలోని జనగామ, చౌటపల్లి, తోటపల్లి గ్రామాల్లోని రైతులు, గ్రామస్తులు చర్చించుకున్నారు. ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు కోసం చౌటపల్లి సర్వేనంబర్ 312తో ఆయా గ్రామాల్లోని పట్టా, ప్రభుత్వ భూముల సర్వేనంబర్ల ఇతరత్రా వివరాలను తెలపడంతో కథనం ఆసక్తికరంగా మారింది. నమస్తే కథనాన్ని ఆయా గ్రామాల్లోని వాట్సాప్ గ్రూప్‌లో షేర్ చేశారు.

## 80శాతం మందికి ప్రభుత్వ విద్య దూరం

- టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అశోక్ కుమార్

సంగారెడ్డి కలెక్టరేట్, నవంబర్ 15: రాష్ట్రంలో 20శాతం మంది విద్యార్థులకు మాత్రమే ప్రభుత్వ విద్య అందుతున్నదని టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అశోక్ కుమార్ పేర్కొన్నారు. తెలంగాణ ప్రోగ్రెసీవ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) జిల్లా కౌన్సిల్ సమావేశాన్ని శుక్రవారం సంగారెడ్డిలోని ఉపాధ్యాయ భవన్‌లో నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన అశోక్‌కుమార్ ప్రభుత్వం ద్వారా విద్యను అభ్యసించే పరిస్థితులు 20శాతం మందికే ఉన్నదని, 80శాతం మంది విద్యార్థులను గాలికి వదిలేస్తున్నారని విమర్శించారు. గురుకుల విద్యాలయాల్లో నాణ్యమైన విద్య కరువైందన్నారు. బడీడు పిల్లలందరినీ బడిలో చేర్పించి సమాన విద్యను అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నదన్నారు. బడ్జెట్‌లో విద్యకు 30శాతం కేటాయించాలని కొఠారి కమిషన్ సూచించినప్పటికీ కేవలం 7శాతం నిధులు మాత్రమే కేటాయించడం విద్యపై ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి అర్థమవుతుందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎస్జీటీ ఉపాధ్యాయులకు ఓటుహక్కు కల్పించాలని డిమాండ్ చేశారు. అర్వే విధుల్లో ఉన్న ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలన్నారు. అదనపు ప్రధాన కార్యదర్శి ముత్యాల రవీందర్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్, రాంచందర్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయ, విద్యారంగ అభివృద్ధికి పాటుపడే అశోక్‌కుమార్‌ను ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గెలిపించాలని కోరారు. సమావేశంలో కౌన్సిలర్లు సంజీవయ్య, లక్ష్మయ్య యాదవ్, సోమశేఖర్, రాజారెడ్డి, నాగేశ్వరరావు, సునీతాఖన్నా, ఉభాష్ బాబు, భాస్కర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అశోక్ కుమార్


సిద్దిపేట వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో కార్తిక పౌర్ణమి సందర్భంగా దీపాలు వెలిగిస్తున్న భక్తులు



## కార్తిక కాంతులు..

సంగారెడ్డి జిల్లాకేంద్రంలోని పీఆర్‌పల్లి కేతకీ సంగమేశ్వరాలయంలో శుక్రవారం కార్తిక పౌర్ణమి సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేసి, కార్తిక దీపాలు వెలిగించారు. దీప కాంతుల్లో ఆలయం దేదీప్యమానంగా గెలుగొందింది. భక్తులతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి. శివకేశవుల నామస్మరణతో మార్మోగాయి. – సంగారెడ్డి/సిద్దిపేట ఫొటోగ్రాఫర్, నవంబర్ 15


సంగారెడ్డిలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు



## ఫిలిప్పిన్స్‌లో ఇంద్రేశం విద్యార్థిని
# అనుమానాస్పద మృతి


- మృతదేహాన్ని ఇండియా తెప్పించేందుకు సాయం కోరిన కుటుంబం

పటాన్‌చెరు, నవంబర్ 15: ఫిలిప్పిన్స్‌లో వైద్య విద్యను అభ్యసించేందుకు వెళ్లిన విద్యార్థిని అనుమానాస్పదంగా మృతి చెందింది. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం ఇంద్రేశం గ్రామంలో నివసించే చింతా అమృతరావు మెదక్‌లో విద్యుత్ శాఖలో డీఈగా విధులు నిర్వహిస్తున్నారు. ఆయన కుమార్తె చింతా స్నిగ్ధ(20) ఎంబీబీఎస్ అభ్యసించేందుకు 2021లో ఫిలిఫ్పిన్స్ వెళ్లింది. అక్కడి పెర్ఫెక్చువల్ హెల్త్ యూనివర్సిటీలో ఎంబీబీఎస్‌లో రెండో ఏడాది చదువుతుంది. గురువారం అర్ధరాత్రి గదిలో ఉన్న స్నిగ్ధకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపేందుకు తోటి విద్యార్థినులు వచ్చారు. గదిలో ఉన్న స్నిగ్ధ తలుపులు తెరవకపోవడంతో ఇండియాలోని కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. బలవంతంగా తలుపులు తెరవాలని కుటుంబసభ్యులు సూచించడంతో తలుపులు తెరిచారు. స్నిగ్ధ గదిలో విగతజీవిగా కనిపించడంతో కుటుంబ సభ్యులకు వీడియో కాల్ ద్వారా చూపించారు. శుక్రవారమే స్నిగ్ధ పుట్టినరోజు కావడంతో వారి బాధ వర్ణనాతీతంగా మారింది. తన కుమార్తె మృతదేహాన్ని ఇండియాకు తెప్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.


చింత స్నిగ్ధ

## తప్పుడు భూరికార్డులు సృష్టించిన వారిపై
# చర్యలు తీసుకోవాలి

దుబ్బాక, నవంబర్ 15: భూమిపై కన్నేసిన అక్రమార్కులు తప్పుడు భూరికార్డులు సృష్టించడంతోపాటు అందులో కొంత భూమిని ఇతరులకు విక్రయించారంటూ బాధితుడు బత్తిని మహేందర్ గౌడ్ శుక్రవారం విలేకరుల ఎదుట గోడు వెల్లబోసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. దుబ్బాక మున్సిపల్ పరిధిలోని లచ్చపేటలో సర్వే నెంబరు 25, 26, 28లో 11 ఎకరాల 23 గుంటల భూమి వారసత్వంగా మా తాత బత్తిని సీతయ్య గౌడ్ నుంచి వచ్చిందని మహేందర్ గౌడ్ తెలిపాడు. 1953 వరకు బత్తిని సీతయ్య పేరిట రికార్డులో ఉందన్నారు. ఉపాధి నిమిత్తం తన తండ్రి, బాబాయ్‌లు హైదరాబాద్‌కు వెళ్లడంతో తన భూమిపై కన్నేసిన అక్రమార్కులు తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించారని ఆరోపించారు. ఈ విషయంపై 1995లో తన తండ్రి బత్తిని కిష్టయ్య కోర్టులో కేసు వేయగా అనుకూలంగా ఇంజక్షన్ ఆర్డర్ ఇచ్చిందన్నారు. ఇదిలాఉండగానే కొంత భూమిని అక్రమార్కులు ఇతరులకు విక్రయించినట్లు తెలిపారు. కోర్టులో కేసు ఉండగా భూమిని విక్రయించడం చట్టవిరుద్ధమన్నారు. అక్రమార్కులు తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించడం వల్ల అధికారులు సైతం ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. త్వరలోనే కోర్టు తీర్పు వెలువడే అవకాశం ఉందన్నారు. అక్రమార్కుల వల్ల భూమి కొనుగోలు చేసినవారు సైతం కోర్టు చుట్టూ తిరుగుతూ ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సిరిసిల్లకు చెందిన ఎర్రగుంట భరత్‌కుమార్‌తో పాటు బత్తిని సతీశ్‌కుమార్ తదితరులు తప్పుడు రికార్డులు సృష్టించారని ఆరోపించాడు. వారిపై కోర్టులో విచారణ జరుగుతుందన్నారు. ఈ విషయంపై దుబ్బాక ఆర్ఐ నర్సింహారెడ్డిని వివరణ కోరగా.. ఆ భూమికి సంబంధించిన వివాదం కోర్టులో కొనసాగుతుంది. ఆ భూమిలో ఎర్రగుంట భరత్‌కుమార్ అనే వ్యక్తి నాలా కన్వర్షన్ లేకుండా 1800 గజాల స్థలాన్ని సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో తప్పుడు రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు మా దృష్టికి వచ్చింది. అతడిపై పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పట్టా భూమి కావడంతో కోర్టు ఆదేశాల మేరకు అర్హులైన వారికి రికార్డులో వస్తుందన్నారు.


మాట్లాడుతున్న మహేందర్‌గౌడ్